# 9

# పంజరం

డియర్ ఆనంద్,

నీ రెండు ఉత్తరాలు అందాయి. పారిపోయిన నీ ముద్దులకొడుకు అనిల్ తొందరగానే దొరికినందుకు సంతోషం. నేను చిన్నప్పుడు పదో తరగతిలో ఇంట్లోంచి పారిపోయినప్పుడు ఏడాది దాక ఎవరికీ దొరకలేదు. నేతపని చాలా కష్టం. నేత పని చేయడం నాకిష్టం లేదు. చదువుకోవాలని ఇష్టం. నా చదువు సాగనీయలేదు. నువ్వుగానీ, మీనాన్నగానీ, నాకు ఏమాత్రం సహకరించలేదు.

నీకు తెల్సు... పారిపోయిన ఆ ఏడాదంతా నేను ఎంత కష్టపడ్డానో!. ఈ కాలపు పిల్లలకు అలా కష్టపడే స్వభావం తగ్గుతున్నట్లుగా ఉంది. వారం రోజులకే అనిల్ కావాలనే మీకు దొరికాడు. మీ నుండి డిమాండ్స్ తీర్చు కోవాలనే తత్వం, పరాధీనత తప్ప స్వయంగా జీవితాన్ని గెలుచుకోగలననే విశ్వాసం లేదని అర్థం.

నేను ఇంట్లోంచి పారిపోయింది మీ అనిల్‌లా అమ్మానాన్నల ద్వారా నా డిమాండ్లు నెరవేర్చు కోవడం కోసం కాదు. కుటుంబంలోని హింస, దారిద్ర్యం భరించలేక పారిపోయాను. చదువు మీదున్న ఆపేక్షతో చదువు వదిలేసి పారిపోవడం ఒక పేరడాక్సు.

ఇంట్లో అమ్మకు నేను చదువుకోవాలని ఉన్నా, నాన్న సాగనిచ్చిందెక్కడ? అమ్మ ఇంటి పనంతా నాకే చెప్పేది. సంపాదించింది తాగి తందనాలాడి కూలి పనికి పొమ్మని కొట్టడం తప్ప నాన్న చదువుకొమ్మన్నదెప్పుడు? తమ్ముణ్ని, చెల్లెల్ని ఎత్తుకొని ఆడించడంతోపాటు పేడతెచ్చి పిడుకులు చేయడం, గుట్టకు పోయి కట్టెలు కొట్టుకరావడం మొదలుకొని మొత్తం పనులన్ని నాకే చెప్పేవాళ్ళు.

ఇప్పుడు అనిల్ పారిపోయింది ఇన్ని కష్టాలు భరించలేకే అంటావా? ఏ ఒక్క రోజైనా అనిల్ మార్కెట్ వెళ్ళి కనీసం కూరగాయలైనా తెచ్చాడా? తన డ్రెస్సులు తాను ఏ రోజైనా ఉతుక్కున్నాడా? ఏ పూటైనా తిండి దొరక్క ఆకలితో పడుకున్నాడా? నీ కొడుకు గారాబం, స్వార్థం ఎక్కువై పారిపోయాడు. ఇంత కఠినంగా అంటున్నందుకు బాధపడకు.

అనిల్ ఒక్కడి కోసం నువ్వు పెడ్తున్న ఖర్చుతో ఈ దేశంలోని పేదపిల్లలు నలుగురు కడుపునిండా తినవచ్చు. మరోమాటలో చెప్పాలంటే నలుగురు పేదల కడుపు కొట్టి నీ కొడుక్కు ఇంతగా ఖర్చు పెట్టగలుగుతున్నావు. ఏడవ తరగతి చదివేవాడికి వెయ్యి రూపాయల బూట్లు కొనిచ్చావు. వెయ్యి రూపాయల డ్రెస్సు కుట్టించావు. పదవ తరగతి దాక నేను ప్యాంటు తొడిగి ఎరుగను. నీ కొడుక్కు నాలుగో ఏటనుండి ప్యాంట్లేమిటి? రేంజర్ సైకిల్ ఏమిటి? ఇంట్లో వాడు కోరిన కలర్ టీవీ తేవడం ఏమిటి?

ఆనంద్! పిల్లలు కోరిందల్లా తెచ్చిస్తే నీ ప్రేమ వ్యక్తం చేసినట్లు అవుతుందనుకుంటున్నావు! అంటే అనిల్ నిన్ను ప్రేమించడానికి వస్తువుల్ని లంచంగా ఇవ్వదల్చుకున్నావన్న మాట!... నీ ఫోన్ బిల్లులో సగం ఉండదురా నా జీతం అని నాతో ఓసారి అన్నావు గుర్తుందా? అయినా నా కూతురు కరుణ కార్లో స్కూలుకెళ్లడంలేదని సిటీ బస్సులోనే పోతోందని నీకు తెల్సు. కాని నీ కొడుకు అనిల్ ఆటోలో వెళ్తాడు. ఎంత తేడా! జీవితంలో పిల్లలకు కష్టాలు తెలియకుండా పెంచాలని, నువ్వు అనుకుంటున్నావు. పిల్లలకు కష్టాలు ఎలా ఉంటాయో తెలుసుకోవాలని నేననుకుంటాను.

ఆనంద్! అయాచితంగా వస్తే విలువ తెలియదు. అయాచితంగా వచ్చే డబ్బూ, స్వేచ్ఛా, స్వాతంత్రమూ అంతే. అవి వచ్చినంత తొందరగా పోగొట్టుకోవడమూ సాధ్యమే. రష్యా తూర్పు యూరపు దేశాల్లో సోషలిజం, స్వాతంత్రం విలువ మూడు తరాలకే అర్థం కాకుండా పోవడం వల్లే పోగొట్టుకోవడమూ సులభమైంది.

అయితే మీవాడికి వెయ్యి రూపాయల బూట్లూ డ్రెస్సూ కొని ఇచ్చావన్న మాట. ఇంకోనాల్రోజులు వెతికితే ఇంకో నాలుగువేలు ఖర్చయ్యేవి కాదంటావా అని అంటావు. నిజమే కొనివ్వడమే నయంలే. తాత్కాలికంగా సమస్య పరిష్కారం

అయిపోయింది. అయితే నా ప్రశ్న అది కాదు. ఇలా ఎన్ని కోర్కెలని తీర్చుకుంటూ పోతావు. దీనికి ఎక్కడో ఓ చోట అంతు లేదా? నీ ఆర్థిక స్థాయికి మించినవి కోరినపుడు ఏంచేస్తావు. ఏం చేస్తావో అదే యిప్పుడు చేస్తే సమస్య ఇంత జటిలం కాదు.

మొఘల్ చక్రవర్తి అక్బరు దర్బారులోనికి మహామంత్రి బీర్బల్ ఓ రోజు ఆలస్యంగా వచ్చాడట. ఇంత ఆలస్యమైందేమిటి అని అడిగితే ఏడ్చే మనువడిని సముదాయించలేక ఆలస్యమైనదన్నాడట. ఒక పిల్లవాడిని సముదాయించలేని వాడివి ఈ సామ్రాజ్యానికి ప్రధానమంత్రిగా ఏం సముదాయిస్తావని ప్రశ్నిస్తే–సామ్రాజ్యాన్ని సమర్థవంతంగా నిర్వహించవచ్చుకాని పిల్లలను సముదాయించలేం అన్నాడట. దీనిపై వాగ్వివాదం జరిగింది. చివరకు అక్బరు తాతగా, బీర్బల్ పిల్లవాడిగా నటించడానికి అంగీకారమైంది.

"తాతా! నాకో కూజా కావాలి" అన్నాడు బీర్బల్.

క్షణాల మీద కూజా తెప్పించాడు అక్బరు చక్రవర్తి.

నాకో ఏనుగు కావాలన్నాడు మహామంత్రి బీర్బల్.

అక్బరు దర్బారులోకి ఏనుగును తెప్పించాడు.

"ఈ ఏనుగును కూజాలో పెట్టు తాతా!" అంటూ బీర్బల్ అడిగాడు.

దర్బారులోని కొలువుదీరిన వారంతా ఏం జరుగుతుందో అని ఊపిరి బిగపట్టి చూస్తున్నారు. వచ్చే నవ్వును ఆపుకుంటున్నారు.

"అందులో ఏనుగు పట్టదు" అని సముదాయించాడు అక్బర్.

"ఆ ఏనుగును కూజాలో పెట్టుతాతా" అంటూ బీర్బల్ చిన్నపిల్లాడిలా ఏడ్వడం ప్రారంభించాడు. ఎంత సముదాయించినా వినలేదు. చెప్పిచెప్పి అక్బరుకు విసుగొచ్చి చివరకు ఓడిపోయానని చేతులెత్తేశాడు.

పిల్లల కోర్కెలు తీర్చడం, వారిని సముదాయించడం చక్రవర్తులకైనా సాధ్యం కాని పని. ఇక నీబోటి, నాబోటి వారిదెంత? మన ఆర్థిక పరిమితుల్ని పిల్లలకు చెప్పాలి. అర్థం చేసుకోకుండా కోరితే తీర్చుకుంటూ పోతావా? జీవితం పట్ల మనకున్న అవగాహనకు విరుద్ధంగా... మనకు స్థోమత ఉన్నంత

మాత్రాన కొనివ్వడమేనా? పేద ప్రజలగురించి కథలు రాస్తావు, కవితలు రాస్తావు, ఉపన్యాసాలు దంచుతావు. నీకొడుకు అదేం పట్టించుకోకుండా గొంతెమ్మ కోర్కెలు తీర్చుమంటే తీర్చుతూపోతే అతనికి నువ్వు అవగాహన పెంచేదెప్పుడు? అన్ని సమకూర్చుతూ అతడు స్వార్థపరుడుగా మారడాన్ని ప్రోత్సహిస్తున్నదెవరు? నీలోని తండ్రి కాదా?

ప్రేమ పేరిట, పిల్లల యిష్టాయిష్టాల పేరిట, పిల్లల స్వేచ్ఛ పేరిట వస్తున్న సిద్ధాంతాలన్ని పాశ్చాత్యదేశాల్లో స్వార్థపరత్వాన్ని పెంచడానికే ఉపయోగపడుతున్నాయి.

... కుటుంబం ఒక జైలు, కాదనను. ఆ జైలు నుండి పారిపోయిన నాకు అదెంత జైలో మరొకరు చెప్పాల్సిన పని లేదు...

... కాని ఆనంద్! వాళ్ల అవసరాలు తీర్చే పేరిట నువ్వుచేస్తున్నదేమిటి? జైలును ప్రేమించేట్టు చేయడం కాదా? జైలును ప్రేమించడం స్వేచ్ఛవుతుందా?

నీ కొడుకు అనిల్ మచ్చికైన జంతువు. అతడు పంజరాన్ని ప్రేమించేపక్షి. కుటుంబం అనే జైలును ప్రేమించడం వల్లే అతడు యితరుల్ని, ప్రపంచాన్ని ప్రేమించలేకపోయాడు. బయటి ప్రపంచంలో బతికే ధైర్యాన్నివ్వకుండా, కుటుంబంలోనే అన్నీ సమకూరుతాయనే స్వార్థ దృష్టి కలిగించడం వల్లనే నీ కొడుకు స్నేహితుడింట్లోనో, ఏ హోటల్‌లోనో పనివాడుగా ఉండలేక తిరిగి దొరికి పోయాడు.

"సమ్మర్ హిల్" పుస్తకం చదువుమంటావు. ఆ పద్ధతిలో పెరిగిన పిల్లల్లో సమాజం కోసం నిస్వార్థంగా పని చేసేవాళ్లుగా ఎదిగినదెందరు అనేది నా ప్రశ్న. ఈ ప్రశ్న వేసుకోకపోతే స్వేచ్ఛ పేరిట స్వార్థపరులుగా మార్చడం తప్ప చేసేదేమిటి?

పిల్లలకు ఆటపాటల్తో ఆనందంగా గడిపే సమ్మర్ స్కూల్సుకు కరుణను రెండుసార్లు పంపాను. వాళ్లక్కడ ఆనందంగా, స్వేచ్ఛగా ఉన్నారు. కాని వారికి పెరిగిన అవగాహన ఏమిటి? తన ఆనందమే ప్రపంచం అనుకోవడం తప్ప. ఆటపాటల సమ్మర్ స్కూలులో ఎంతో ఆనందంగా గడిపిన కరుణ క్లాస్‌మేటు 'బదనిక' తన ఈడేవున్న బిచ్చగత్తె కాస్త అన్నం పెట్టుమని అడిగితే పొమ్మంటే

పోకపోతే పెంపుడు కుక్కను ఉసిగొల్పింది. భయంతో ఆ పాప గావుకేక పెడ్తూ పరిగెత్తింది. పదంగల్లో కుక్క ఆ పాప కాలు కండ పీకింది. పొద్దున్నే స్కూలు బస్సు కోసం బయల్దేరిన కరుణ ఆ దృశ్యం చూసింది. ఆ రోజు మధ్యాహ్నం అన్నం తినలేదు. ఇంటికొచ్చేసింది. రాత్రికి జ్వరం అందుకుంది. జ్వరంతో కలవరింతలు. "డాడీ! ఆ పాప బతుకుతుందా? డాడీ ఆ పాపని ఆసుపత్రికి తీసికెళ్దాం. ఎక్కడుందో వెతకవూ.....డాడీ! బదనికతో యిక నేను మాట్లాడను" అంటూ కలవరింతలు.

ఆ బిచ్చగత్తె అమ్మాయిని ఎక్కడని వెతకను. మూడు రోజులు జ్వరం తగ్గలేదు. "మీ డాడీ గ్రీడీ ఫెలో ...... అందుకే నిన్ను కార్లో పంపడు అని బదనిక అంటుంది. మీరు పిసినారియా డాడీ!" అని అడిగింది కరుణ బదనిక ఆనందం ఆమె ఆనందం. దానివల్ల సమాజానికి మేలు లేకపోగా కీడే ఎక్కువ.

అనిల్ క్రిస్మస్ సెలవుల్లో మా యింటికి వచ్చినప్పుడు ఎట్లా ప్రవర్తించాడో నీకు తెల్సు. కరుణను చూస్తే జెలసి. పోనీ మా చెల్లెలి పిల్లల్తో కల్సి ఉన్నాడా? బోలెడు గర్వం. సర్వెంట్ క్వార్టర్స్‌లో ఉన్న మధూలికను ఎంత అసహ్యించుకున్నాడో నీకు తెల్సు. గర్వానికి వయస్సు, హోదా, డబ్బుతో నిమిత్తం లేదు. కలెక్టర్ దగ్గరుండే అటెండరుకు ఎంతో గర్వం ఉండొచ్చు. కలెక్టర్ ఎంతో సౌమ్యుడు కావచ్చు.

నీ కొడుకు అనిల్ అలిగింది బాధతోనే కావచ్చు. కానీ ఆ బాధ గర్వం నుండి ఏర్పడిందే తప్ప పేదరికంలోంచి పుట్టిన నిస్సహాయతలోంచి కలిగిన నిజమైన బాధ కాదు.

అనిల్‌ను మార్చాలంటే నాతోనే అవుతుందంటావు. నావద్దే వుంచుకోమంటావు. సరే! నేను వాణ్ని చదివిస్తాను. కానీ వానికన్నా ముందు వాళ్లమ్మ ఆమనిని మార్చు. నీ భార్యలో, పిల్లల్లో అవగాహన పెంచు.

ఆనంద్! తల్లులు గొప్పవారే. కాని వారు పిల్లలకు స్వార్థాన్ని నేర్పడం వల్లనే పిల్లల వ్యక్తిత్వాలు యిలా రూపొందుతున్నాయి. ఆమని పొలం పనులు చేసే మీ అన్నయ్య పిల్లల్ని ఎలా చూస్తుందో వాళ్ళను నీ పిల్లలు కూడా అలానే చూస్తారు. పేదవాడని నీ పిల్లలు వాళ్ళింటికి వెళ్ళకపోవడానికి వాళ్ళ అమ్మే కారణం.

అసలు చుట్టాలు బంధువుల యిళ్ళకు వెళ్ళడం గానీ వారి పిల్లల్తో కల్సిపోవడం గానీ పూర్తిగా తగ్గిపోయిందని రాశావు. ఆమనియే అందుకు కారణం.

కుటుంబ నియంత్రణ వల్ల, వ్యక్తి కుటుంబాల వల్ల ఇంట్లో పిల్లల సంఖ్య తగ్గి కుటుంబానికి పరిమతమౌతూ చొరవ కోల్పోతూ బంధువులనే సెంటిమెంట్సు తగ్గుతున్నాయన్న నీ అభిప్రాయం తప్పు. కుటుంబ వ్యవస్థ ఈ రోజు స్వార్థానికి కేంద్రం. తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్తు అనే పేరుతో కుటుంబాన్ని స్వార్థానికి కేంద్రంగా మార్చారు.

ఉమ్మడి కుటుంబాలున్నపుడు అనుబంధాలు ఆప్యాయతలుండేవని, ఇపుడవి అంతరించాయని బాధపడ్డావు. ఆ అనుబంధాలు ఆప్యాయతలు పెంచుకుంటే కలగవా? వారికి ఎక్కడ పెట్టాల్సి వస్తుందనే స్వార్థమే లేకపోతే వ్యక్తి కుటుంబాల బంధువులు ఉమ్మడి కుటుంబాల్లోలా ఎందుకు కల్సిపోవడం లేదు.

ఆనంద్! పిల్లలు తమ స్వార్థం కోసం తల్లిదండ్రుల్ని కూడా లెక్క చేయడం లేదని, ఉన్న ఈ చిన్నిపాటి కుటుంబ వ్యవస్థ అంతరిస్తే ఎలా అని వాపోయావు. ఈ కుటుంబ వ్యవస్థ ఎంత తొందరగా అంతరిస్తే అంత తొందరగా మనుషుల మధ్య, అనురాగం, ఆత్మీయత పెరిగే నవసమాజం ఆవిర్భవిస్తుంది. అది మునుపటి సోషలిస్టు వ్యవస్థ కన్నా ఉన్నతంగా ఉంటుంది.

ఈ కుటుంబం విచ్ఛిన్నమైతే పిల్లలు మనుషులందరిని ప్రేమించడం ప్రారంభిస్తారు. ఈ కుటుంబ వ్యవస్థ ఉన్నంతకాలం తల్లి దండ్రులు తమ పిల్లల్ని మాత్రమే ప్రేమిస్తారు...

... అయితే కుటుంబం మొత్తం సమాజాన్ని ప్రేమించే సంస్కృతిని నేర్పితే కుటుంబం విచ్చిన్నమయ్యే అవసరమూ లేదు. వ్యక్తిగత కుటుంబంలో పిల్లలు తన వాళ్ళను, తన స్వార్థాన్ని మాత్రమే ప్రేమిస్తారు. ఈ కుటుంబ వ్యవస్థ ఒక పంజరం.

ముందు అనిల్‌ను ఆ ప్రయివేట్ స్కూల్ నుంచి తీసేసి గవర్నమెంట్ స్కూల్లో చేర్పించు. పేద పిల్లలతో పాటే నీ పిల్లలు చదువుకోనీ. ఆపని

చేయకుండా సమాజం మారాలని పేదల గురించి ఆలోచించాలని అనేదంతా నీ స్వార్థంలో భాగమే అని గతంలోనే చెప్పాను.

ఆ రోజు నువ్వు ఎంత బాధపడ్డావు. అప్పుడప్పుడు యూనియన్‌లో ఎందుకు పనిచేస్తున్నానా అని బాధపడ్డావు. సరిగ్గా డ్యూటీ చేయమని చేప్తే అన్నా! సారు అని పిలిచిన వారే వాడేమైనా మాకు ఆఫీసరా? బాసా? అని పరోక్షంగా తీవ్ర విమర్శ చేశారన్నావు. డ్యూటీ సరిగ్గా చేయమని డిమాండ్ చేసే అధికారం లేని నీ యూనియన్ పోరాటాలన్నీ స్వార్థాన్ని పెంచడానికే, వాళ్ల అవినీతికి రక్షణ కల్పించడానికి తప్ప మరెందుకు ఉపయోగపడుతాయి?.

పిల్లలూ అంతే. వాళ్ల పనులు వాళ్లు చేసుకోరు. ఇంట్లో పనులకు సహకరించరు. ఎవరికి ఏ పని చేయరు. కాని తల్లిదండ్రులుగా మనం వాళ్ల అవసరాలన్నీ తీర్చుమంటారు.

ఇది స్వార్థపరుల సమస్యే తప్ప పిల్లల సమస్య కాదురా! పిల్లల సమస్యగా చూడకూడదు. నిజానికి నువ్వుకూడా స్వార్థపరుడుగానే పెరిగావు. మీ అమ్మానాన్న కూడా స్వార్థపరులుగానే బతికారు. నిన్ను అలానే పెంచారు. అప్పుడు ఈ విషయాలు నీకు చెప్పలేకపోయాను. నాకప్పుడు ఆ స్థాయి లేకపోయింది. ఒక్కసారి గతాన్ని గుర్తు చేస్తాను.

... ఒరే ఆనంద్! నువ్వొక హెడ్‌మాస్టర్ కొడుకువి. నువ్వు పుట్టుక తోనే మధ్యతరగతివి. ఇప్పుడూ మధ్యతరగతివే. నేను అట్టడుగు వర్గాన్ని. నిరక్షరాస్యుల కాయకష్టం చేసే పేదల కొడుకుని. ఇప్పుడు నీ భాషలో పాలక వర్గం స్థాయికి ఎదిగిన పారిశ్రామికవేత్తను.

నేను పేదరికం నుంచి కష్టపడుతూ పారిశ్రామికవేత్తగా ఎదిగాను. నాకు మధ్య తరగతి జీవితం అంటే ఏమిటో తెలియదు. అది నాకు అందలేదు. అందువల్ల నేను ఇప్పటికీ పేదవాడిగానే ఆలోచిస్తుంటాను. మధ్య తరగతి స్వభావం నాకు అబ్బలేదు. నా పిల్లలకు అబ్బకూడదనే నేను అనేక జాగ్రత్తలు తీసుకుంటున్నాను. నా పిల్లలు మధ్యతరగతి స్వార్థంలో కూరుకుపోకుండా పేదరికాన్ని తెలుసుకొని ఉదారంగా స్పందించే హృదయం ఉండాలని కోరుకుంటున్నాను.

ఆనంద్! నిజానికి మనిద్దరివి రెండు రకాల జీవితాలు. నా అనుభవాలు వేరు, నీ అనుభవాలు వేరు. మనిద్దరం ఏనాడూ సమానంగా, సాదృశ్యంగా, ఒక వర్గంగా జీవించిన జీవితాలు కావు. నీ నా ఆలోచనలు అనుభవాలు ఒక్కటిగా కలవడం ఎలా సాధ్యం?

ఒరే ఆనంద్! నీ సొంత తమ్ముడు నిరుద్యోగిగా ఉండగానే, నీ చెల్లెలు కోమల పెళ్లి కాకముందే వేరు పడ్డావు. కల్సి వుంటే సాయం చేయాల్సి వస్తుంది, ఎక్కువ కట్నం యిచ్చి పెద్ద సంబంధం చేయాల్సి వస్తుందని నీ స్వార్థం చూసుకున్నావు. అవసాన దశలో ఉన్న మీ అమ్మను అన్నింటికి అందుబాటులో ఉన్న నీ దగ్గర ఉంచుకోకుండా ఆమని మాటపై బీడీలు చేసుకొని బతికే నీ చెల్లెలు కోమలి ఇంటికి పంపావు. నాలుగు రాళ్లు కోమలి మొహాన కొట్టి నేను పంపలేదా అన్నావు. నీ దగ్గరుంటే మీ అమ్మ ఇంకో ఇరవై ఏళ్లు బతికేది... కాదా!

... నీ చెల్లెలు గర్భసంచి ఆపరేషన్ కోసం అన్నయ్యా అని ఏడుస్తూ వస్తే ఏం సాయం చేసావు? ఆమె తాగుబోతు భర్త మరోదాంతో ఉంటే ఏం చేశావు? ఆమెకిప్పుడది క్యాన్సర్‌గా మారింది. ఆ పాపం ఎవరిదిరా? కాని కలర్ టీవీ కొన్నావు. చావుబతుకుల మధ్య ఉన్న నీ చెల్లెలు కోమలి ఆరోగ్యం పట్టలేదు గాని అనవసరపు టెన్షన్స్‌తో తెచ్చిపెట్టుకున్న ఆమని రోగాలకు అంతగా యిదైపోతావేంరా? నాలా ఎదగాలనే అత్యాశలు వదులుకుంటే ఆమని రోగాలన్నీ మటుమాయమౌతాయి. నాలా ఎదగడానికి మీరు నాలాగ కష్టాలు పడడానికి సిద్ధంగా ఉన్నారా?.

ఒరే ఆనంద్! నేను హోటల్లో జీతం ఉన్నప్పుడు టెన్త్ ఫీజు కడ్తాను కొన్ని పైసలివ్వురా అంటే లేవన్నావు. కాని సైకిల్ కొనుక్కున్నావు. ప్లాటుఫారంపై పడుకుంటే దొంగ అని కేసు పెట్టి జైల్లో వేస్తే నీకు మూడు వుత్తరాలు రాశాను. ఒక్కపైసా పంపావా? ఒక్కనాడైనా చూడ్డానికి వచ్చావా? ఉడిపి హోటలాయన అతని కొడుకు చనిపోయిన బాధతో వెళ్లిపోతూ దాన్ని ఏదో ధరకు యిస్తానన్నప్పుడు హోటల్ కొందామని కొన్ని పైసలు ఇవ్వు, నీకు తెల్సినకాడ వడ్డీకి ఇప్పించు అని అడిగాను. అప్పుడు నువ్వు టీచరు ఉద్యోగం చేస్తున్నావు. పైసలు లేవన్నావు. కాని నీవు యిల్లు కోసం ప్లాటు కొన్నావు.

పి.జి.లో ఆ ఎమ్మేల్లే నీ క్లాసుమేటు. నువు చెప్తే ఆ లైసెన్సు ఈజీ గానే యిప్పిస్తాడని అడిగాను. ఒక్కమాట చెప్పలేదు. మా అమ్మకు పెద్దాపరేషనైంది. అప్పటికి నాకు పెళ్లి కాలేదు. ఒక్క పది రోజులు ఆమనిని తీసుకొని షోలాపూర్ రమ్మన్నాను. పిల్లలకు నర్సరి చదువు పోతుందన్నావు.

ఒరే ఆనంద్! నీకు సహాయం చేస్తాను. తప్పకుండా చేస్తాను. నీ యిల్లు, ప్లాటు, ఫర్నిచర్, ఉద్యోగం అన్నీ కోల్పోయి రోడ్డున పడితే అప్పుడు నా చిన్ననాటి స్థాయికి చేరావనుకుంటాను... అప్పుడు నీలా ఊరికే మాటలు చెప్తూ, సానుభూతి ఒలకబోస్తూ కూర్చోను. నీ అంతటి స్వార్థపరున్ని కాదు వీలు కాదనడానికి. నువ్వు అన్నీ కోల్పోయినప్పుడు నిన్ను తప్పకుంటా ఆదుకుంటాను. నీకు ఓ ఉద్యోగం ఇప్పిస్తాను... ఇలా అంటే నీకు చాలా కోపం వస్తుంది. కానీ ఈమాట నువ్వు ఎంతమందితో అన్నావో గుర్తుందా?.

ఒరే లెక్చరర్! లెక్చర్లు దంచడం నీ ఒక్కడికే కాదు... ఎదుటి వారికి కూడా లెక్చర్లు దంచడం వచ్చునని గ్రహించు. నీ ఏడుపంతా కలిసి పది పేజీలు నీ గొడవలు, బాధలు కథలు కథలుగా ఉత్తరాలు రాయగానే అయ్యో పాపం అని అప్పు ఇవ్వగలిగే సహృదయత నాలో లేనందుకు విచారిస్తున్నాను.

ఒరే ఆనంద్! నేను పేదగా వున్నప్పుడు నీ సుఖాల్లో ఆనందాల్లో పాలుపంచుకోవడానికి పిలువలేదు. నా కష్టాల్లో నీవేనాడూ ఆదుకోలేదు. ఇక మన మధ్య ప్రేమ అనే పేరిట ఉన్నది ఏమిట్రా! అవకాశవాదం తప్ప. దానికి క్లాస్‌మేటని, ఒకే వీధివాడని, ప్రేమ అని పేర్లు పెట్టినంతమాత్రాన నమ్మేంత పిచ్చివాడినైతే ఈ స్థాయికి ఎదిగి ఉండేవాడినే కాదురా!.

నువ్వు యివాళ ఒక సాంఘిక గౌరవం, హోదా పెరిగాక మానవతా విలువలు, ఆప్యాయతల గూర్చి మాట్లాడుతున్నావా? నీ మధ్యతరగతి ఎదుగుదలే వీటిని ధ్వంసం చేయడం నుండి ఎదిగిందని నీకు తెలియదను కోవాలా? ఏవిరా నువ్వు చెప్పేవిలువలు, ఆప్యాయతలు నీలో ... ఇప్పుడైనా ఉన్నాయా?...

నా ఎదుగుదలలో ఎన్ని కష్టాలు... ఎంత సంఘర్షణ... ఎంత రిస్కు ఉందో భద్రజీవితం గడిపే మీలాంటి నెలవారీ ఉద్యోగ జీవితాలకు అర్థం కాదు. తెలిసే అవకాశం లేదు. మార్కెట్ శక్తులు, పోటీ ప్రపంచం నిరంతరం

మమ్మల్ని ఎలా వెనక్కి నెట్టివేస్తుందో... నిరంతరం ఏటికి ఎలా ఎదురీదాలో మీకు తెలియదు. మీది హాయిగా గడిచిపోయే తరతరాల మధ్యతరగతి సుఖవంతమైన జీవితం... నాలాగ నూటికొక్కరో, కోటికొక్కరో కష్టాలనుంచి కష్టపడి ఎదిగితే పాలకవర్గంగా... పారిశ్రామికవర్గంగా... మారిపోయామని అక్కసు వెళ్ళగక్కుతారు. మళ్ళీ మాలాంటివాళ్ళవద్దే ఉద్యోగాలకు దేబరిస్తారు. మీకు కావలసింది ఉద్యోగ భద్రత. భద్రమైన మధ్యతరగతి జీవితం. మా జీవితాలు మీలాంటివి కావు. ఎప్పుడు కిందపడతామో తెలియని జీవితాలు. అందుకే కరుణను కష్టాలు తెలియాలని కారులో కాకుండా బస్సులో బడికి పంపుతున్నాను..

ఆనంద్! నువ్వు నన్ను పిసినారి అనుకున్నా నేను బాధపడేదేమి లేదు. నువ్వడిగిన డబ్బు మాత్రం ఇవ్వలేను. ఆమని ఆ వెధవ టెస్టులన్ని చేయించి లేని రోగాలున్నట్లు బాధపడి కొత్త రోగాలు తెచ్చుకొని అప్పుల పాలయ్యే బదులు అల్లోపతి వైద్యం వదిలేసి హోమియోపతినో, ప్రకృతి చికిత్సనో, యోగానో ఆశ్రయించు.

నీ సంపాదనెంతో నీకు తెలుసు. అంతకుమించి అప్పుచేయకు. నీ ఇంట్లో ఉన్న ఫ్రిజ్జు అమ్మేయ్. ఆ బంగారం అమ్మేయ్. నీ స్కూటర్ అమ్మేయ్. మొన్ననే కొన్న నీ ప్లాట్ అమ్మేయ్. అప్పులు తీర్చుకో. ఇవన్నీ ఉండగా నన్ను డబ్బు అడగడం నీ స్వార్థాన్ని కాక మరి దేన్ని తెలుపుతుంది?

జీవితంలో ఎంతో అవసరమైన ప్రతి సమయంలో నీవు సాయం చేయగలిగిన స్థాయిలో ఉండీ చేయలేదు. ఎందుకో తెల్సా! నేనంటే నీకున్న చిన్నచూపురా!. మధ్య తరగతిగా వున్న నువ్వు చెప్పడమే తప్ప దేన్ని ఆచరించని నీ వర్గ స్వభావం.

ఆనంద్! నేను ఎదిగితే నీలో చూసి ఓర్వలేనితనం. నీ సానుభూతి మీదనే నేను జీవితమంతా బతకాలని కోరుకున్నావు. అసలు సమయాల్లో ఆదుకోని నీ సానుభూతి నా మీద ఆధిక్యత చెలాయించడానికే తప్ప నీది నిజమైన ప్రేమ కాదని తెల్సుకోవడానికి నాకే దశాబ్దాలు పట్టింది.

సమాజం నుండి పొందుతున్న దానికి మీరు తిరిగి సమాజానికి పేదలకు అందించాల్సిన కనీస సేవలు, కర్తవ్యాలు ఎన్నో ఉన్నాయి. అవి నిర్వర్తించకుండా

మీరే తరాలతరబడి మధ్యతరగతిగా ఉంటూ జీవన ప్రమాణాలు ఇంకా... ఇంకా... పెరగాలని కోరుకుంటూ, డిమాండ్ చేసుకుంటూ... ఇలాగే ముందుకు సాగితే సమాజంలో ఇలాగే అసమానతలు పెరుగుతుంటాయి.

అప్పుడెప్పుడో ఒకసారి నువ్వన్నట్లు నేను జాతీయ బూర్జువానే... నీవు మధ్యతరగతివే... నేను బూర్జువానైతే నువ్వు పెటిబూర్జువావి. నువ్వు పేదవికాదు. మనమిద్దరం పాలకవర్గమే. నేనైనా ఉత్పత్తిలో పాల్గొంటూ సంపద సృష్టిస్తున్నాను. మీరైతే ఏ సంపద సృష్టించకుండా సమాజం సృష్టించే సంపదను వీలైనంతమేరకు వాడుకొని సుఖపడడమే మీహక్కు అనుకుంటున్నారు.

అయినా... మాకు కర్తవ్యాలు నిర్దేశించే హక్కు మీ పెటి బూర్జువాలకే ఉందనుకుంటున్నారు. మిమ్మల్ని నిలదీసేవారు లేకుండా చేస్తున్నారు. కాని మీరు నిర్వహించాల్సిన కర్తవ్యాలు నిర్వర్తించక పోవడంవల్లే సమాజం ఇలా అస్తవ్యస్థంగా కొనసాగుతున్నది.

మీరు మీ స్వార్థాన్ని వదిలి మీకన్నా అట్టడుగున జీవిస్తున్న ప్రజలకోసం చేయూతనివ్వండి. నాలాగ చిన్నప్పుడు కష్టాల్లో ఉన్నప్పుడు ఆదుకోండి... ఇలా సమాజం నుండి ఎంత పొందారో, అంత తిరిగి సమాజానికి మీరు అందిస్తే... అప్పుడు ఇప్పటిలా ఏ కొందరో మొత్తం సమాజం మారడానికి యుద్ధంలో బలి అయ్యే దశ అంతరిస్తుంది. అందరు కల్సి సమాజాన్ని ఆనందమయంగా మార్చుకుంటారు.....

ఆనంద్! పిల్లల్లో ఆప్యాయతలు అడుగంటుతున్నాయని ఏడుపెందుకురా? నీలో ఆమనిలో అవి ఉంటే కదా వాళ్ళు నేర్చుకోవటానికి. నీ మూల భాష స్వార్థంరా! ఆ స్వార్థం వల్లే కుటుంబ పంజరంలో బందీవైనావు. ఆ స్వార్థ బందీఖానా నుండి బయటికి వచ్చి సవ్యంగా ఆలోచిస్తే స్వేచ్ఛ, నిస్వార్థం, వాటిలోని ఆనందం, సమాజం అర్థం అవుతాయి.

స్వార్థమే కుటుంబ వ్యవస్థలో.... పిల్లల పెంపకంలో మూలభాష.

స్వార్థం నశిస్తే కుటుంబ వ్యవస్థ కూడా అదృశ్యమవుతుంది.

తోటి వారికి తోడ్పడే స్వభావం, వారిని ప్రేమించే స్వభావం, ఆచరణ కుటుంబంలో నేర్పితే సమాజం మొత్తం ప్రేమ పూరితమవుతుంది. నీలాగ

మధ్యతరగతిగా ఎదిగినవాళ్ళు పరోపకారంతో సమాజంపట్ల స్పందిస్తే... తోటివారికి సహకరిస్తే... సమాజం ప్రేమపూరితమౌతుంది.

మీ స్వార్థం కనపడకుండా చాలా చక్కగా మర్యాదలు నటిస్తుంటారు. మాకది చేతకాదు. మాది హృదయపూర్వక ఆహ్వానం. అందుకే మా ఆవిడ మన పిల్లలు కలిసి ఆడుకోవడం చూసి కరుణను అనిల్‌కు చేసుకోన్రి అన్నయ్యా! అని అడిగింది. అప్పుడు నువ్వు ఏమన్నావో గుర్తుందా? మన జీవితంలో ఎన్నడూ అడ్డురాని మన కులాలు, గోత్రాలు, జాతకాలు అంటూ ఏవేవో గుర్తు చేశావు. నీ కడుపులో ఏముందో చెప్పకనే చెప్పావు. మా పట్ల మీకు లోలోపల ఎంతో చిన్న చూపు వుందని, మా ఎదుగుదలను హృదయ పూర్వకంగా ఆహ్వానించడం లేదని, నీ మాటలే పట్టిచ్చాయి...

ఆనంద్! అవన్నీ తెలిసికూడా నేను స్నేహానికి కట్టుబడి ఉన్నాను. అనిల్‌ను నాదగ్గరకు పంపు. నీ భారం తగ్గుతుంది. నా కూతురు కరుణతోపాటు కలిసి చదువుకుంటాడు. పెళ్ళిల్ల సంగతి తర్వాత... అది వాళ్ళ ఇష్టం. నువ్వు నేను నిర్ణయించేది కాదు. ఇక్కడ నావద్ద ఉంటాడనే భావిస్తాను. కరుణతోపాటు మా చెల్లెలు కొడుకు, నీ కొడుకు కూడా మా యింట్లోనే ఉండి చదువుకుంటారు.

ఇంట్లో ఇక నీ కొడుకు అనిల్ గురించిన గొడవలు అక్కరలేదు. క్రమశిక్షణతో నీ కొడుకు జీవితంలో చొరవ పెంచుకుంటే నన్ను చూసి నాలాగ ఎదుగుతాడు. లేదా నీలాగ ఉద్యోగం వెతుక్కుంటాడు. ఏదైనా మంచిదే. నేను చేయగలిగే సహాయం చేస్తాను. ఆనంద్! ఆమనిని ఒప్పించి అనిల్‌ను తీసుకొని ముగ్గురు కలిసి ఒకసారి ఇంటికిరండి. మీకోసం ఎదురుచూస్తుంటాను.

ఇట్లు
నీ చిన్ననాటి స్నేహితుడు, క్లాస్‌మేట్

**మిట్టపెల్లి కొమురయ్య**

**ఆంధ్రభూమి మాస పత్రిక ఆగస్టు, 1999**

❄ ❄ ❄